# గ్రద్దలు

బొలుసు వెంకటేశ్వర్లు



"ఒరేయ్ ... అప్పలకొండా!" ఆయాసంతో పిల్చింది లచ్చమ్మ !

"ఊఁ ! !"

"ఒరేయ్! అప్పల... కొండా!! నేనీ చెట్టుకింద... గుటుక్కు మంటే నీకేటి... నాభంరా!! ఆ . మునిసిపాలిటోళ్ళు...నా కట్టెని... పట్టుకుపోయి... ఎక్కడో... పాతిపెట్టేత్తారు! అందుకు..."

"ఆఁ! అందుకు...?"

"ఆ'మేన్....రోడ్డురు' కాడికి...నెమ్మదిగా నన్ను... తీసుకుపోరా!!"

"ఎందుకే....?" విభ్రాంతిగా అడిగాడు అప్పలకొండ!

అప్పలకొండకి పధ్నాలుగేళ్ళుంటాయ్!

అప్పలకొండ ఏపీఁ చదువుకోలేదు. కానీ చదువుకుంటే వాడు ఒకటో తరగతిలో "అరటి-ఆవు" అని అనేవాడు కాడు! "అమ్మ ! ఆకలి!!" అనే తప్పకుండా అనేవాడు! ఆ రెండే తెలుసు వాడికి!

సావడానికి అమ్మ మేన్‌రోడ్డురుకాడికి ఎందుకు పోవాలంటోందో అర్థంకాక ఆశ్చర్యంతో అలా చూస్తూ కూర్చున్నాడు అప్పలకొండ!

ఏదో చెపుదామనుకొన్న లచ్చమ్మ మళ్ళీ దగ్గురావడంతో లేచి కూర్చుంది!

మాడిపోయిన పొట్టని మరింత నొక్కేసి—పేగుల్ని మెలితిప్పేసి—గొంతుని ఉబ్బించి—కళ్ళని తేలించి—కొంచెం రక్తాన్ని సాయం తీసుకుని ఉరికి వచ్చేసింది దగ్గు!!

లచ్చమ్మలో ఇంకా ఎక్కడుందో రక్తం!!

అప్పలకొండ పాస్టిక్ 'గళాసు'తో అందించిన నీళ్ళు రెండు గుక్కలు తాగి, నిస్త్రాణగా వెనక్కి ఒరిగింది లచ్చమ్మ!!

"ఒరేయ్ ఇయ్యేలో...రేపో నాను రాలిపోక తప్పదు.... అంచేత నన్ను.... నెమ్మదిగ... ఆ... 'మేన్ రోడ్డుడు' మీదకి తీసుకుపోరా... నాను సచ్చిపోయ్యేక "బాబూ! మా యమ్మ సచ్చిపోనాది... దిక్కులేనోళ్లి...దరమం సెయ్యండి బాబూ..."అని నా శవాన్ని చూపెట్టి పెజల్ని...నాల్డబ్బులు...అడుక్కుందుగాని ... ఆ పైసల్తో ... నువ్ .... నాల్రోజులు ... కడుపునిండా....బువ్వ... తినొచ్చు...."

బొందిలో ప్రాణంఉన్నంతవరకు కడుపున పుట్టినవాళ్ళ కడుపు నిండిందో లేదోనని ఏడ్చేది ఒక్క అమ్మే!

లచ్చమ్మకి చివరి కోరికలంటూ ఏవీఁలేవ్! ఉంటే ఇదొక్కటే! '....తను సచ్చిపొయ్యేక తన శవంపై నాల్డబ్బులు ఎక్కువగా పడాలి! ఆ డబ్బుల్తో అప్పలకొండ నాల్రోజులు కడుపునిండా అన్నం తినాలి, అంతే!'

చచ్చేటప్పుడు గొంతులో తులసి తీర్థాలు అక్కర్లేదు.

తగలబడిపోయేక ఎముకల్ని గంగలో కలపక్కర్లేదు.

ఊరంతా సంతర్పణలు చెయ్యక్కర్లేదు.

బ్రతికి ఉండగానే తమ 'ఉత్తర క్రియలు' ఘనంగా చేస్తారో లేదోనని బెంగపడి పోయేవాళ్ళకి, లచ్చమ్మకీ ఎంత తేడా?

ఈ పవిత్ర భారతదేశంలో అందరిలా ఏడుస్తూనే పుట్టింది లచ్చమ్మ. కొందరిలా మాత్రం నవ్వుతూ బతకలేకపోయింది.

కట్టుకున్నవాడు సారాకి బానిసైపోయి రోజూ తనను చితగ్గొడుతున్నప్పుడు ఏడిచింది.

కడుపున పుట్టిన ఆడబిడ్డ పెళ్ళి కాకుండా తల్లైపోయి, ఆనక అయిపూ ఆనవాలూ లేకుండా ఎవడితోటో లేచిపోయినప్పుడు...

అప్పలకొండ కడుపున బడ్డప్పుడు 'మొగుడు' సారా మైకంలో లారీ కిందపడి చచ్చిపోయినప్పుడు...

ఎండిన తోలుముక్కల్లాంటి గుండెల్ని చీకిచీకి ఆకలితో అప్పలకొండ గుక్కెట్టి ఏడుస్తున్నప్పుడు....

పది ఇళ్లు తిరిగినా 'గుంటడి' కడుపునిండా మెతుకులు సంపాదించలేనప్పుడు...

మాయరోగం—క్షయ! తనమీది కురికి రెండేళ్ళనుండి రక్త మాంసాల్లేని తనని పిల్చి పిప్పి చేస్తున్నప్పుడు

లచ్చమ్మ ఏడిచింది. ఏడుస్తూనే వుంది.

ఇప్పుడు....

మెయిన్‌రోడ్డు దగ్గరి కెళ్ళేదాకా తన బొందిలో ప్రాణం నిలపమని ఆ "భగమంతుణ్ణి" మొక్కుకుంటూ ఏడుస్తోంది!

అప్పలకొండకి లచ్చమ్మ చెప్పిన మాటలు చాలా చిత్రంగా అన్పించాయి.

'మెన్‌రోడ్డురు' పక్కన శవాన్ని ఉంచి డబ్బు లడుక్కుంటున్న వాళ్ళని చాలాసార్లు చూశాడు.

"...ఆ శవం పక్కల్ని డబ్బులు! అడుక్కుంటున్న వాళ్ళ డబ్బాల్లో గళ్లు గళ్లుమంటూ బోల్డు డబ్బులు!"

కాని శవంకేసి చూళ్ళేకపోయేవాడు అప్పలకొండ! 'భయం!' "అయితే...అమ్మ—రేపు — శవంలా —అయిపోద్దా?? రేపు—అమ్మ—సచ్చిపోతే— తన దగ్గిర బోల్డు డబ్బులు! ఆ డబ్బుల్తో—ఏం తినాలి?— సెగోడీలు— పాకంజీళ్ళు—ఇడ్డెన్లు — ఇడ్డెన్లయితే ఎన్నొస్తాయో?" అప్పలకొండ కళ్లు మూసుకుంటే పావలా కాసులు, అర్ధరూపాయి కాసులూ, పది పైసల బిళ్ళలూ కనిపించాయి.

అప్పల...కొండా!

కళ్ళు తెరిచి అమ్మకేసి చూశాడు వాడు!

"రా! పోదాం! మేన్....రోడ్డురు...కాడికి..." నెమ్మదిగా లేచి అడుగు లేస్తోంది లచ్చమ్మ.

అప్పలకొండ లేచి సత్తుగిన్నె చేత్తో పుచ్చుకున్నాడు. దాంట్లో పాస్టిక్ 'గళాసు' పడేశాడు. చిరుగుల గోనిసంచీ మడతపెట్టి చంకని దోపాడు!

ఓ ఫర్లాంగ్ దూరం నడిచి లచ్చమ్మ అక్కడే కూలబడి ఖంగు ఖంగుమని దగ్గుతోంది.

అప్పలకొండకి ఆకలిగా వుంది.

"అమ్మా! ఆకలే!"

లచ్చమ్మ వాడికేవీఁ జవాబు చెప్పలేదు. చెప్పడానికి ఆమె దగ్గఱ ఏ జవాబూలేదు కూడా!

నెమ్మదిగా లేచి లచ్చమ్మ నడకిచ్చుకుంది.

రోడ్డే పోతున్న వాళ్ళకేసి దీనంగా చూస్తూ "బాబూ" అంటూ చెయ్యి చాపింది. మరో రెండు వీధులు దాటేసరికి లచ్చమ్మ చేతిలో ఇరవై పైసలు పడ్డాయి.

"...ఇందా! పోయి...టీ తాగిరా! నా నిక్కడే...కూకుంటా! గమ్మున...పోయిరా!"

"మరి...నీకో—"

"నాను...తాగను...నువ్... పోయిరా!" అంటూ అక్కడే చతికిలబడింది లచ్చమ్మ.

అప్పలకొండ హుషారుగా టీ దుకాణంవైపు పరిగెత్తాడు.

సత్తుగిన్నెడు మంచినీళ్లు తాగేసి, ఆపైన 'టీ' చప్పరించాడు.

టీ కొట్లో—అద్దాల్లో తమ అందాల్ని చూసుకుని మురిసి పోతున్నాయి రకారకాల స్వీట్లూ—పకోడీలూ!

అప్పలకొండ నోట్లో నీళ్ళూరాయి,

"ప్చ్...విప్పుడు...నాభం ... నేదు. రేపు...అమ్మ సచ్చి పొయ్యేక బోల్డు డబ్బులొ త్తే .. ఇయ్యన్నీ ... కొనుక్కు-తినె య్యాల...."

అప్పలకొండ టీ తాగి వచ్చేసరికి లచ్చమ్మ తలకి కొంగుకప్పుకుని సన్నగా వణుకుతూ కూర్చొని వుంది.

ఫస్ట్‌షో చూసిన జనం ఇళ్ళకి పోతున్నారు.

అమ్మా ! ఇకెంత...దూరం . . . పోవాల్నే?"

"ఇక్కడే ... వచ్చే ... సాం" ఆయాసంగా అంది లచ్చమ్మ

అక్కడున్న పోలీస్టేషన్ పక్కనున్న సినిమాహాలు దగ్గరికి చేరడానికి లచ్చమ్మకి అరగంట సమయం పట్టింది.

తెల్లారితే ఈ పక్కనుండి ఆ పక్కకి పోడానికి "పట్నంవోళ్లే" భయపడే "న్యాలోర్డ్లజెంక్షన్" ట్యూబులైట్ల కాంతితో... నిశ్శబ్దంగా... మేష్టారిచేతిలో బెత్తాన్ని చూసి భయపడి పోయిన క్లాసురూంలా వుంది!!

ఉడిపిహోటల్ పక్కగా లచ్చమ్మ కూలబడింది.

అప్పలకొండని కూర్చోమని సైగచేసింది.

అప్పలకొండ అమ్మ ఒళ్లో తలెట్టి పడుదున్నాడు !

అప్పుడప్పుడు ఒకళ్లూ ఇద్దరూ టీ దుకాణాలకేసి పోతున్నారు. సెకండ్‌షో కూడా వదిలేసారు.

పొలో మని జనం - వాన కురిసి వెలిసినట్లు మెయిన్‌రోడ్డు గుండా ఇళ్లకు పోతున్నారు.

రిక్షా గణగణలు కూడా తగ్గిపోయాయ్..

లచ్చమ్మ కళ్ళు మూసి గోనిపట్టాపై ఒరిగింది.

అమ్మ చెప్పిన పాఠం నెమరేసుకుంటున్నాడు అప్పలకొండ !!

"...రేపు అమ్మ సచ్చిపోతే..." బాబూ ! మా యమ్మ... చ్చిపోనాది దిక్కు లేనోణ్ణి !! బాబయ్యా ! దరమం సేయండి బాబూ ! !" అని సత్తుగిన్నె పుచ్చుకుని అనాలి ! !" ఆ డబ్బుల్తో సందేళ ... ఏదేనా "ఒటేలు" కెళ్ళి...కడుపునిండా ..అన్నం తినెయ్యాల! ... మరి అమ్మో ?? అమ్మనేం సెయ్యాల ? ? ..."

అమ్మనేం చెయ్యాలో తోచలేదు అప్పలకొండకి.

చిరాగ్గా తలగోక్కున్నాడు !!

"అమ్మా ! అమ్మా !"

లచ్చమ్మ పలకలేదు. నెమ్మదిగా అమ్మని తట్టి లేపా అప్పలకొండ. అటూ ఇటూ కదిలించాడు.

ఊహుఁ ! లచ్చమ్మ పలుకులేదు ఉలుకులేదు"

"అమ్మోయ్ ! అమ్మోయ్ !!" గట్టిగా ఇంకా గట్టిగా పిలిచాడు

"ఏందిరా ! అద్దరేతిరి ...ఎదవగోల !!"

పక్కనే రిక్షాలో ముడుచుకొని పడుకున్న ఆసామీ లే వచ్చాడు.

"మా యమ్మ ఎంత లెగొట్టినా .. లెగడం ..లేదు !! భయ భయంగా అన్నాడు అప్పలకొండ.

కిరసనాయిల్ దీపంబుడ్డి తెచ్చి, ఆ వెలుగులో లచ్చమ్మ పరకాయించి చూసాడు రిక్షా ఆసామీ. లచ్చమ్మలో చైతన్యం లేద

లచ్చమ్మ ముక్కు దగ్గర వేలెట్టి చూసాడు.

"ఏందిరా ? జబ్బేంది ??"

"చ్చయ"

"ప్చ ! ఎప్పుడో సచ్చిపోనాదిరా ! కుర్రోడా ! !

ఆ ఆసామీ ఏదో గొణుక్కుంటూ రిక్షా తీసుకుని అక్కణ్ణుం పోయాడు. అప్పలకొండకి చాలా ఆశ్చర్యం వేసింది.

"...అమ్మ సచ్చిపోనాదా ? ఎప్పుడో సచ్చి...పోనాదా ? ఇప్పుడే గద .. మాటాడింది ? సావు అంటే...ఇదేనా ఇంతేనా

లచ్చమ్మ మొహంలోకి చూసాడు అప్పలకొండ ! ని పోతున్నట్లే వుంది!!

" ..రేపణ్ణుంచి .. అకలేత్తే గంజెవరు పోత్తారు ? ?"

అకలి గుర్తుకు రాగానే అప్పలకొండకి ఏడుపు వచ్చేసింది.

లచ్చమ్మ గుండెలమీద బడి ఏడిచేసాడు ! !

మంచుకి మరింత చల్లబడిపోయి ఉంది లచ్చమ్మ శవం.

లచ్చమ్మ పక్కనే చలికి ముడిచిపెట్టుక్కూర్చున్నా అప్పలకొండ!!

"తెల్లారితే అమ్మ శవాన్ని చూసి ... అంతా డబ్బులేత్తార డబ్బుతో ... కడువునిండా .. తిని ప్చ .. ఇంకా ఎప్పుడు తె రుద్దో ? ?"

తెల్లవారింది ! !

ప్రతీరోజూ లాగా ఈ పొద్దు లచ్చమ్మ తనకి దండాలు పెట్ట టంలేదని కాబోలు - సూరీడు - మబ్బుల్లోనే మసులుతున్నాడు ! !

రోడ్డుమీద జనం తిరుగుతున్నారు.

శవం పక్కనే ఓ పావలాకాసు 'టింగ్' మంటూ పడింది.

అప్పలకొండ తలెత్తి చూసాడు. మళ్ళీ ఓ పదిపైసలు పడింది. కాస్సేపటికి అయిదు పైసలు బిళ్లా ! !

అప్పలకొండ కళ్లు మిలములా మెరిసాయ్.

సత్తుగిన్నె పుచ్చుకుని లేచాడు.

ఆకలి.. నీరసంతో ...కళ్లు తిరిగాయ్!!

"..బాబూ ! అయ్యా ! ! మా అమ్మ సచ్చిపోనాది ... దిక్కు లేనోణ్ణి ... దరమం సేయండి బాబూ ! అమ్మా .. దరమం సెయ్యండి ! !

కొందరు శవంకేసి చూసి జేబులోంచి అయిదు పైసలో, పది పైసలో, పడేస్తున్నారు అప్పలకొండ గిన్నెలో.

మరికొందరు శవాన్ని చూడ్డానికి భయపడి మొహం తిప్పుకుని పోతున్నారు ! !

పొద్దుటెండకి అప్పలకొండకి మొహం తిరుగుతోంది.

ఆకలి ! ! నీరసం ! !

అయినా అప్పుడు అప్పుడు గిన్నెలో పడుతున్న డబ్బులు అప్పలకొండకి శక్తినిస్తున్నాయ్.

సరిగ్గా... అప్పుడే ... అదే సమయంలో...

ఒక బలమైన చెయ్యి అప్పలకొండ జుట్టు పట్టుకుని కిందకి తోసేసింది. అప్పలకొండ చేతిలోని సత్తుగిన్నె దొర్లుకుంటూ తనలో ఉన్న డబ్బుల్ని చెల్లా చెదరు చేసుకుంటూ రోడ్డు కడ్డంగా పోయింది!!

అప్పలకొండ తేరుకొని చూసేలోగానే గూబలమీదట పాటపా దెబ్బలు పడ్డాయ్.

"ఎవ్వడ్రానువ్...దొంగలంజకొడకా !! అది మీ అమ్మట్రా ? ? ఏడ్డంత . . లేవ్ ! ! దొంగలంజాకొడకా ! ఇప్పుడే నువ్ . . ఇల్లా ఉంటే...పెద్దయ్యాక ఊళ్ళకి ఊళ్ళే దోచేత్తావ్!"

గళ్ళలుంగీ కట్టుకున్న ఆసామీ ఒకడు రౌద్రంగా అరుస్తూ అప్పలకొండని కింద పడేసి తన్నుతున్నాడు.

జనం అంతా పోగయ్యారు.

లచ్చమ్మ శవంమీద పడి ఓ ఆడమనిషి "అత్తయ్యో ! అత్తయ్యా ! !" అంటూ రాగాలు పెడుతోంది.

అప్పలకొండకి జరుగుతున్నదేమిటో అర్థం కాలేదు.

దేశంలో సహస్ర ముఖాలుగా విక్రమిస్తున్న - విజృంభిస్తున్న అవినీతి-అధర్మం-దౌష్ట్యం-మహా మేధావులకే అర్థం కాకపోతుంటే- అప్పలకొండకి ఏం అర్థం అవుతుంది ?

గళ్ళలుంగీవాడు చుట్టూచేరిన వాళ్ళకి దండాలు పెడుతూ చెప్పుకుపోతున్నాడు.

"...బాబూ! ఆ సచ్చిపోయిన మనిషి నా తల్లిబాబూ! ఆ ఏడు తున్న ఆడమనిషి నా పెళ్లాం బాబూ! మాది 'ఇశాపట్నం' బాబూ! రెండు రోజాల క్రితం 'డాట్టరు పంతులు'గోరికి సూపెడదావని మా యమ్మని ఇక్కడికి తీసుకొచ్చినాం బాబూ! ఈ మజ్జె మాయమ్మకి కాస్త మతి కూడా దెబ్బతింది బాబూ! నిన్నట్నుంచి అది మా కళ్ళ బళ్లేదు ! తిరిగి తిరిగి—దాని—ఖర్మ — ఇక్కడ పేనాలొగ్గేసింది! సూడండి బాబూ! ఈ దొంగలంజెకొడుకెవరో గాని కొడుకులా మా యమ్మ—శవం—పక్కనజేరి — డబ్బు లొడికేసుకుంటున్నాడు! ఘోరం! సూడండి బాబూ!"

అందమైన అబద్ధానికి నిజం బలైపోయింది!

అన్నింటినీ అనుమానించడమే నేర్పుతుంది పట్నం నాగరికత ప్రజలకి ?

చుట్టూజేరిన వాళ్ళంతా అప్పలకొండని అనుమానంగా చూశారు. కొందరు అసహ్యంగా చూశారు ! కొందరు కాల్చేసేటట్టు చూశారు ! అప్పలకొండ నిర్ఘాంతపోయాడు, రాయిలా నిలబడిపోయాడు.

"అమ్మ...నాకు—అమ్మకాదా?" ఆడు సెప్పేదంతా అబద్ధం, ఆ—అమ్మ—నా—అమ్మే" అని గట్టిగా అరుద్దామనుకున్నాడు. కాని వాడినోట మాటరాలేదు.

గళ్ళలుంగీవాణ్ణి భయం భయంగా చూస్తూ అల్లాగే ఉండి పోయాడు

రోడ్డుమీద కూలబడిన అప్పలకొండని జుట్టు పట్టుకుని పైకి లేవదీశాడు గళ్ళలుంగీవాడు.

"చెప్పు! ఎవ్వడ్రా నువ్!"

"నా పేరు—అప్పల—కొండ—మాయమ్మ—"

"ఎవత్తిరా మీ యమ్మ? దొంగలం...కొడకా!" అని విసురుగా కొట్టాడు గళ్ళలుంగీవాడు.

అప్పలకొండకి కళ్ళు బైర్లుకమ్మాయ్

నెమ్మదిగా కూర్చుని రోడ్డుమీద చెదిరిపోయిన నాణేల్ని ఏరుకుంటున్నాడు. "అదిగో బాబూ? మీరే సూడండి. ఆడు డబ్బులికి చేరిన 'మాదచ్చోదు' అవునో కాదో? సూడండి బాబూ!"

గబగబా తన దగ్గిరికి వస్తున్న గళ్లలుంగీవాణ్ణి చూసి భయంతో అప్పలకొండ, గుప్పిట్లో చిల్లర డబ్బుల్ని గట్టిగా పట్టుకుని లేచి పరుగెత్తబోయాడు.

గళ్లలుంగీవాడు ఒక్క అంగలో అప్పలకొండ చెయ్యట్టుకుని డబ్బుల్లాక్కుని, వెనక్కి తోసేడు.

అప్పలకొండలో తెగింపు వచ్చేసింది.

ఏడుస్తూ, "ఆ డబ్బులు, నాయి" అంటూ గళ్లలుంగీవాడి కాళ్ళమీద తన్నాడు. వాడు దబ్బుని కిందపడ్డాడు.

ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు కరుచుకుంటున్నారు.

కుక్కల్లా—కాట్లాడుకుంటున్నారు.

జనం సినిమాలా చూస్తున్నారు. పైసా ఖర్చులేని వినోదాన్ని ఆస్వాదిస్తున్నారు!

అప్పలకొండకి పెదవి చిట్లి రక్తం కారుతోంది. మోకాళ్లు—మోచేతులూ, నడ్డిమీద పుళ్లుపడ్డాయి.

అలసిపోయాడు. ఆయాసంతో రొప్పుతున్నాడు.

"మళ్ళీ — కనిపించావంటే — పేనాలు — తీసెత్తా—నీయమ్మా!"

ఆయాసంతో రొప్పుతూ అరిచాడు గళ్లలుంగీవాడు.

అప్పలకొండ నెమ్మదిగా లేవలేక లేచాడు.

ఆకలి! నీరసం!!

తినాలనుకున్న 'ఇడ్డెన'ల్నీ మిఠాయిల్నీ తల్చుకున్నాడు. కడుపులో పేగులు పులిపిల్లల్లా 'గుర్రు' మంటున్నాయి.

కళ్లు తిరుగుతుంటే వీధి చివరకెళ్ళి అక్కణ్నించి చూస్తున్నాడు.

గళ్లలుంగీవాడు ఓ నిమిషం లచ్చమ్మ దగ్గిర కూర్చుని ఏడిచినట్టు నటించాడు.

అప్పలకొండ వదిలిపెట్టిపోయిన సత్తుగిన్నె పుచ్చుకుని రోడ్డే పోయేవాళ్ళని ధర్మం చెయ్యండని బతిమాలుకుంటున్నాడు.

అప్పుడప్పుడు వచ్చేపోయేవాళ్ల కాళ్లుఅంటి ఏదో చెపుతున్నాడు లచ్చమ్మ శవాన్ని చూపెడుతూ!

గళ్లలుంగీవాడి గిన్నెలో పదిపైసలు, పావలాలు, టింగ్-టింగ్ మని పడుతూనే ఉన్నాయి.

గిన్నెలోకి చూసినప్పుడల్లా- 'సందేల' ఎన్ని గ్లాసులు సారా తాగొచ్చో తల్చుకు మురిసిపోతున్నాడు గళ్లలుంగీవాడు లోలోపలే!

అప్పలకొండ అల్లా చూస్తూనే ఉన్నాడు దూరంగా నిలబడి—నిస్సహాయంగా!

అమ్మకీ-అన్నానికీ, దూరంగా!


## సాహిత్యంలో సంశయ కల్లోలం

శ్రీ ఆవంత్స సోమసుందర్ నూత్న గ్రంథం వెలువడింది. యువరచయితలకు సాహిత్యాభిమానులకు కలుగుతున్న అనేక సంశయాలకు సహేతుక సమాధానాలు. సభలలోనూ, లేఖల ద్వారాను అడిగిన సుమారు నూరు ప్రశ్నలకు సశాస్త్రీయమైన జవాబులు.

1/8 క్రౌను 160 పుటలు వెల రు12లు మాత్రం పది రూ॥లు M. O. చేయువారికి 1రూ.కి VPP చేయగలం.

ప్రతులకు :
కళాకేళి పబ్లికేషన్సు
పిఠాపురం - 533450 (ఆ. ప్ర.)